## ప్రపంచ రాజధానుల సరసన అమరావతి

**అత్యంతంత అధునాతన నగర నిర్మాణం: నారాయణ**

అమరావతి,మే2 : ఏపీ కలల రాజధాని అమరావతిని తరతరాలు గర్వపడేలా నిర్మిస్తామని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. అమరావతి పునర్నిరమాణ సభలో ఆయన ప్రసంగించారు. పదేళ్ల క్రితం ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని పురుడు పోసుకుంది. పునఃప్రారంభం కూడా ఆయన చేతుల మీదుగా జరగడం మన అదృష్టం అని అన్నారు. ప్రపంచంలోనే అగ్రభాగాన ఉన్న 5 రాజధానుల్లో ఒకటిగా అమరావతిని నిర్మించాలనే లక్ష్యంతో 2014-19లోనే రూ.40వేల కోట్ల విలువైన పనులు ప్రారంభించాం. దాదాపు రూ.9వేల కోట్ల పనులు పూర్తి చేశాం.


# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి

రి.నెం. 119/2015

ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా

ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ | ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు | ఉచిత కంప్యూటర్ శిక్షణ

సంప్రదించవలసిన చిరునామా

అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A.L.L.B

ఆళ్లగడ్డ

9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 03-05-2025 సంపుటి : 06 సంచిక : 354 పేజీలు : 8 వెల : రూ 1-00


# చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతోంది





అమరావతి,మే2( : ఏపీ ప్రజల చిరకాల స్వప్నం అమరావతి సాకారం కాబోతుందని ప్రధాని మోదీ అన్నారు. అమరావతి ఒక పుణ్య భూమి అని.. నేను ఈ పుణ్యభూమిపై నిలబడి మీ అందరితో మాట్లాడటం ఆనందంగా ఉందన్నారు. అమరావతి అంటే సాంప్రదాయం, పురోగతి అని.. స్వర్ణాంధ్ర నిర్మాణానికి అమరావతి ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. అమరావతి అంటే కేవలం ఒక నగరమే కాదని.. ఒక శక్తి అని అభివర్ణించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉందని అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు. ఇవాళ దాదాపు రూ.60 వేల కోట్ల పనులకు శంఖుస్థాపనలు చేశా.. అయితే ఇవి కేవలం శంఖుస్థాపనలే కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు బలమైన పునాదులని పేర్కొన్నారు. శుక్రవారం వెలగపూడిలో అమరావతి పునర్నిర్మాణ పనులను మోడీ ప్రారంభించారు. మొత్తం 18 ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. మోడీ చేతుల మీదుగా అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభంఅయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మోడీ మాట్లాడుతూ.. ఏఐ, ఐటీ, ఎడ్యుకేషన్, హెల్త్ ఇలా అన్ని రంగాల్లో అమరావతి కీలకంగా మారబోతుందని అన్నారు. అమరావతి ప్రతి వ్యక్తి కలల నిర్మాణమని.. త్వరలోనే వారి స్వప్నం సాకారం కాబోతుందని చెప్పారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ఐటీ విజన్ అద్భుతమని.. ఆయన ఐటీ విజన్ ను నేను అప్పుడు గుజరాత్ సీఎంగా ఉండి పరిశీలించానని తెలిపారు. నాణ్యమైన ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలంటే చంద్రబాబు తర్వాతే ఎవరైనా అని ప్రశంసించారు. 2015లో అమరావతి నిర్మాణానికి నేనే శంఖుస్థాపన చేశా.. పదేండ్లు ఏపీ అభివృద్ధి కోసం సహకరించామని పేర్కొన్నారు. ఏపీని వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్‌గా తయారు చేయాలని కోరారు. ఏపీలో కనెక్టివిటీ-కి కొత్త అధ్యాయం మొదలైందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని చెప్పారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. టెక్నాలజీ నాతో మొదలైనట్లు- చంద్రబాబు ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ- అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు- అందిస్తుందని అన్నారు.ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు.. ఏపీ ప్రగతి, (మిగతా 8లో )

స్వర్ణాంధ్ర నిర్మాణానికి అమరావతి ఎంతో కీలకం
అమరావతి అంటే ఒకనగరం కాదు...ఒక శక్తి
60వేలకోట్ల పనులకు శంకుస్థపానలు
ఇవన్నీ ఎపి ప్రగతికి..వికసిత్ భారత్‌కు పునాదులు
అన్ని రంగాల్లో అమరావతి అద్భుత నరగంగా ఆవిర్భవిస్తుంది
చంద్రబాబు విజనరీ నేత..ఉమ్మడి ఎపిలో ఐటికి పెద్దపీట
అమరావతికి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ
అమరావతి పునర్నిర్మాణ సభలో మోడీ ప్రసంగం

# చరిత్రలో లిఖించదగ్గ పునర్నిర్మాణ రోజు

గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది
అధికారం చేపట్టాక..అంధకారం నుంచి పట్టాలెక్కిస్తున్నాం
డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఇక అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా
రైతుల త్యాగాలు..వారి ఉద్యమాలు చారిత్రాత్మకం
మోడీ డైనమిక్ లీడర్‌షిప్‌తో ఐదోస్థానానికి దేశ ఆర్థిక వ్యవస్థ
అమరావతి పునర్నిర్మాణ సభలో సిఎం చంద్రబాబు



అమరావతి,మే2( : అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ' ఈ రోజు చాలా గొప్ప రోజు. చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజు. ఆ రోజు అమరావతి పనులకు ప్రధాని మోదీ గారు శంకుస్థాపన చేశారు. ఐదు సంవత్సరాలు విధ్వంసం జరిగింది. పనులు నిలిచిపోయాయి. మళ్లీ ప్రధాని మోదీ గారే పున:ప్రారంభం చేస్తున్నారంటే.. దీనికంటే మంచి రోజు చరిత్రలో ఇంకోటి లేదని అన్నారు. ఉగ్రవాదం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. ' ముందుగా మీ అందరికీ ఓ విషయం చెప్పాలి. గతంలో మోదీ గారిని ఎప్పుడు కలిసినా.. చాలా ఆహ్లాదకరంగా ఉండేవారు. కానీ, మొన్న అమరావతి కార్యక్రమానికి పిలవడానికి వెళ్లాను. ఆ మీటింగ్ చాలా గంభీరంగా సాగింది. దీనికి కారణం.. ' నా దేశ ప్రజలు ఉగ్రవాదుల దాడిలో చనిపోయారు' అన్న ఆవేదన మోదీ గారిలో చూశాను. ఈ సందర్భంగా మీ అందరి తరపునా ఆయనకు నేనో విజ్ఞప్తి చేస్తున్నాను. ఉగ్రవాదాన్ని అణిచివేయడానికి మోదీ, కేంద్రం తీసుకునే నిర్ణయాలకు మేము అండగా ఉంటాం' స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వం గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ' రైట్ -టైం .. రైట్ లీడర్ ఫర్ ది నేషన్.. దట్ ఈజ్.. నరేంద్ర మోదీజీ. చాలా దృఢమైన నాయకుడు.. బ్యాలెన్స్ కలిగిన నాయకుడు. ప్రపంచం నలుమూలలా ఉన్న ప్రజలందరూ మోదీ నాయకత్వాన్ని మెచ్చుకుంటున్నారు. నరేంద్ర మోదీ తన 11 ఏళ్ల పాలనలో ప్రపంచ ఎకానమీలో దేశాన్ని 10 స్థానం నుంచి 5వ స్థానానికి తీసుకువచ్చారు. ఈ సంవత్సరం జపాన్‌ను వెనక్కు నెట్టి 4వ స్థానంలోకి రాబోతోందని అన్నారు. ఈ సందర్భంగా వందేమాతరం అంటూ ప్రజలను ఉత్తేజితులను చేయగా మోదీ కూడా వంత కలిపారు. వందేమాతరం.. భారత్ మాతాకీ జై అంటూ చంద్రబాబు నినాదాలు చేశారు. ప్రజలతోనూ సీఎం నినాదాలు చేయించారు. ఏపీ కలల రాజధాని అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదు.. ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్ అని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆశలు, ఆకాంక్షలకు ఈ నగరమే ప్రతిరూపమన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 29 వేల మంది రైతులు ఏకంగా 34వేల ఎకరాల భూమిని రాజధానికి పూలింగ్ కింద ఇచ్చారంటే.. దేశానికే కాదు.. ప్రపంచానికే ఇదో చరిత్ర అన్నారు. అలాంటి అమరావతి నగర నిర్మాణం తలపెడితే.. గత ఐదేళ్లలో ఎలాంటి విధ్వంసం జరిగిందో చూశామన్నారు.సరైన సమయంలో.. సరైన నేత దేశాన్ని పాలిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మోదీ నాయకత్వాన్ని ఆమోదిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ పదో స్థానంలో ఉండేది. ప్రస్తుతం ఐదో స్థానానికి ఎదిగింది. త్వరలోనే మూడో స్థానానికి చేరుతుంది. 2047 నాటికి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతుంది. ఒకవైపు అభివృద్ధి మరోవైపు పేదరిక నిర్మూలనకు మోదీ కృషి చేస్తున్నారు. కులగణన చేయాలని ఇటీవల మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఇదో గొప్ప నిర్ణయం అని ప్రశంసించారు. గత ఎన్నికల్లో ప్రజలంతా ఓట్లేసి గెలిపించారు.

## క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు

### చంద్రబాబుతో టెక్ దిగ్గజ సంస్థల భేటీ





అమరావతి,మే2( అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడింది.శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో జరిగిన కార్యక్రమంలో టెక్ దిగ్గజాలు ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీలతో దేశంలోనే తొలి -టెక్‌పార్క్‌కు ఏపీ సర్కార్ ఎంవోయూ కుదుర్చుకుంది. 2026 జనవరి 1న తొలి క్వాంటం వ్యాలీ టెక్‌పార్క్ ప్రారంభంకానుంది. క్వాంటం కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఐబీఎమ్, టీసీఎస్, ఎల్ అండ్ టీలతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. క్వాంటం పరిశోధన, ఆవిష్కరణలతో పాటు- ఏపీని ప్రపంచ హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సర్కార్ ముందు సాగుతోంది. అమరావతిలో భారతదేశపు మొట్టమొదటి, అత్యాధునిక క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ నిర్మాణం కానుంది. దేశంలోనే తొలిసారి ఐబీఎం అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ 156 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ కలిగిన 'క్వాంటం సిస్టం 2'ని అమరావతిలో నెలకొల్పనుంది.

# భూములిచ్చినరైతలు త్యాగాలు మరువలేనివి

లాఠీదెబ్బలు..కేసులను ఎదుర్కొని నిలిచారు
మీరిచ్చింది భూమి కాదు...రాష్ట్రానికి భవిష్యత్
వారి కష్టనష్టాలను గుర్తు పెట్టుకుని అమరావతి నిర్మాణం
గుండెల్లో బాధ పెట్టుకుని వచ్చిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు
అమరావతి పునర్నిర్మాణ సభలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



అమరావతి,మే2( రాజధాని నిర్మాణానికి 34000 ఎకరాలు ఇచ్చిన 29 వేల పైచిలుకు రైతులుకు డిప్యూటీ- సీఎం పవన్ కళ్యాణ్ నమసా ్కరాలు తెలిపారు. అమరావతి రైతులు ఐదు సంవత్సరాలుగా నలిగిపోయారని.. రోడ్ల మీదకు వచ్చి, ముల్లకంచెలపై కూర్చొని, పోలీసులు లాఠీ దెబ్బలు తిని, కేసులు పెట్టించుకున్నారని గుర్తు చేశారు. 2000 రైతుల ప్రాణ ాలు కోల్పోయాయని చెప్పారు. రైతులు నలిగి బాధపడి, తమ కన్నీళ్లు తుడిచేవారు ఉన్నారా? అని చాలామంది మహిళలు రైతులు ఆ రోజుల్లో తను అడిగిన సన్నివేశాన్ని గుర్తు చేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తెలుస్తుందా? అని రైతులు అడిగినట్లు తెలిపారు. మోడీకి ఏదీ ఉండదని.. అమరావతి శాశ్వత రాజధాని అని మోడీ నమ్మారని ఆరోజు చెప్పినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మరోసారి మోడీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణం పున ప్రారంభం జరుగుతుందన్నారు. 5 కోట్ల మంది ప్రజలకు సంబంధించి ఈ రాజధాని ఒక హబ్ లాంటిదని, ఓ ఇల్లు లాంటిదన్నారు. రైతులు పడ్డ బాధలను గుర్తు చేసిన డిప్యూటీ- సీఎం వపన్ కళ్యాణ్ నాటి రోజులను గుర్తు చేశారు. గత ఐదేళ్లలో మీరు పడ్డ బాధలు, మీరు తిన్న లాఠీ దెబ్బలు, మీరు అనుభవించిన అవస్థలు అన్ని మా మనసులో ఉన్నాయి.

## మూడేళ్లలో అమరావతి నిర్మాణం

### మోడీ చేతులమీదుగానే ప్రారంభం

### సిఎం చంద్రబాబు వెల్లడి

అమరావతి,మే2 : మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేసి, తిరిగి ప్రధాని మోడీతోనే ప్రారంభిస్తామని సిఎం చంద్రబాబు చెప్పారు. 5 కోట్ల మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలు అమరావతి నా రాజధాని అని చెప్పుకునేలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధాని మోడీ, కేంద్ర సహకారంతో అమరావతిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి చేస్తామని.. మళ్లీ అప్పుడు అమరావతి ప్రారంభోత్సవానికి కూడా మోడీనే రావాలని కోరారు. సకల హంగులతో ప్రపంచం మెచ్చే విధంగా అమరావతిని తీర్చిదిద్దుతామని అన్నారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలకు అమరావతిని అనుసంధానిస్తామని చెప్పారు. 5 లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఆధునిక నగరంగా నిర్మిస్తామని అన్నారు. ఇందుకు కట్టుబడి పనిచేస్తామని అన్నారు.

# మన నమో మిస్సైల్‌తో పాక్ మటాష్

## వంద పాకిస్థాన్‌లు వచ్చినా ఏమీ చేయలేవ్వు

## అమరావతి సభలో లోకేశ్ ఉద్వేగపూరిత ప్రసంగం

అమరావతి,మే2 ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. పదేళ్ల క్రితం 2015 అక్టోబరు 22న అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగానే అమరావతి పునర్నిర్మాణం మొదలైంది. ఈ కార్యక్రమంలో మంత్రి నారాలోకేష్ మాట్లాడుతూ... పహల్గాం దాడిలో అమరులైన టూరిస్టుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వేదిక



మీద నుంచి పాకిస్థానీయులను గట్టిగా హెచ్చరించారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన కుటుంబాలకి దేశం మొత్తం అండగా నిలుస్తుంది. పాకిస్థాన్ గీత దాటింది. అమాయకులను చంపింది. చాలా పెద్ద తప్పు చేసింది. ఒక్క పాకిస్థాన్ కాదు.. 100 పాకిస్తాన్ లో వచ్చినా.. భారతదేశ నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేదు. 100 పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే.. ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉంది. ఆ మిస్సైలే నమో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని అన్నారు. సింహం ముందు ఆటలాడకూడదు. ఆడితే ఏమవుతుందో అందరికీ తెలుసు. మన ప్రధాని మోడీ కొట్టే దెబ్బకి ప్రపంచ మ్యాప్ లోనే పాకిస్థాన్ కనుమరుగైపోతుంది. ఈరోజు పాకిస్థాన్ ఆర్మీలో పని చేసే వాళ్ళు కొంత మంది రాజీనామా చేశారు. కొంతమంది సెలవు పెట్టి పోయారు. అది మన మోడీ పవర్ అంటే.. మన ప్రధాని దెబ్బకు పాకిస్థాన్ దిమ్మ తిరగడం ఖాయమని మంత్రి నారాలోకేష్ వ్యాఖ్యానించారు. భారత్ వద్ద మోడీ అనే మిసైల్ ఉందన్నారు. అమరావతి పునఃనిర్మాణ సభలో అమరావతి నమో నమః అని రెండు సార్లు అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు.నమో కొట్టే దెబ్బకు పాకిస్థాన్ దిమ్మ తిరగడం ఖాయం. భారత గడ్డపై గడ్డి మొక్క కూడా పీకలేరు. మోదీకి ఏపీ అంటే ప్రత్యేక అభిమానం. ఏపీ ప్రాజెక్టులకు ఆమోదం చెబుతూ మద్దతు ఇస్తున్నారు. 2014లో రాజధాని కూడా లేకుండానే విడిపోయాం. చంద్రబాబు ఆత్మస్థయిర్యం కోల్పోకుండా రాష్ట్రాన్ని నిలబెట్టారు. చంద్రబాబుపై కోపంతో కొందరు రాజధానిని పక్కనబెట్టారు. అమరావతికి అండగా ఆంధ్రా ప్రజలంతా నిలబడ్డారని అన్నారు. ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా అమరావతి రైతులు తగ్గేదే లే అన్నారు.గతప్రభుత్వందొంగకేసులు పెట్టిఎన్ని కుట్రలు చేసినా జై అమరావతి నినాదాలను మాత్రం ఆపలేకపోయింది.

# సంపాదకీయం

శనివారం 03-05-2025

## కవ్వింపు చర్యలకు పాకిస్తాన్...

### సంయమనం పాటిస్తున్న భారత్

ఉగ్రదాడిపై పశ్చాత్తాపం వ్యక్తం చేయడం మానేసి భారత్‌తో పాకిస్థాన్ కయ్యానికి కాలు దువ్వుతున్నది. పహల్గాం దాడి తర్వాత ఇరు దేశాలమధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో పాక్ సైన్యంతోపాటు ఆ దేశ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ భారత్‌ను మరింత రెచ్చ గొడుతున్నారు. పాక్ రక్షణమంత్రి ఖవాజా మహమ్మద్ ఆసీఫ్ ఇటీవల స్థానిక మీడియాతో మాట్లాడుతూ పాకిస్థాన్‌పై భారత్ సైన్యంతో దాడి చేసే అవకాశం ఉందని, అదే జరిగితే అణ్వాయుధాలను ఉపయోగించాల్సి వస్తుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే తమపై రానున్న 24 గంటల్లో సైనిక చర్య చేపట్టేందుకు భారత్ ప్రణాళికలు రచిస్తోందంటూ ఆ దేశ సమాచార శాఖమంత్రి అతవుల్లా తరార్ అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం ఉగ్రదాడిపై స్పందించేందుకు భద్రతా దళాలకు ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛను ఇచ్చిన తర్వాత అతవుల్లా ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు పాక్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ సరిహద్దు వెంబడి కొద్ది రోజులుగా కాల్పులు జరుపుతూ భారత సైన్యాన్ని కవ్విస్తోంది. తమ వైఫల్యాల నుంచి ప్రపంచం దృష్టి మరల్చడానికే పాక్ ఇదంతా చేస్తున్నట్టు పరిస్థితులనుబట్టి అర్థమవుతున్నది. బైసరన్ లోయలో పర్యాటకులపై కాల్పులకు పాల్పడ్డ ఐదుగురు ముష్కరుల్లో అదిల్ హుస్సేన్ థాకేర్, అలీ భాయ్, హషిమ్ ముసా అనే ముగ్గురు పాకిస్థాన్ పౌరులుగా దర్యాప్తులో తేలింది. హషిమ్ ముసా గతంలో పాక్ సైన్యం ప్రత్యేక దళంలో కమాండో హోదాలో పని చేశాడని, ఉగ్రవాద కార్యకలాపాల్లో శిక్షణ తీసుకోవడంతోపాటు పాక్ గడ్డమీద నుంచి తన కార్యకలాపాలను స్వేచ్ఛగా నిర్వర్తిస్తున్న లష్కరే తోయిబా ఉగ్రసంస్థతో అతడికి సంబంధాలు ఉన్నయనే విషయాలు దర్యాప్తులో వెల్లడయ్యాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందన్న వార్తలను గత కొన్నేళ్లుగా ఖండిస్తున్న పాక్ ఇప్పుడు ఆ విషయాన్ని బహిరంగంగానే ఒప్పుకుంది. ఇటీవల ఓ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న పాక్ మంత్రి ఖవాజా ఆసిఫ్ 'అమెరికా, బ్రిటన్‌సహా పశ్చిమ దేశాల కోసమే మూడు దశబ్దాలపాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం' అన్నాడు. ఆ దేశ మంత్రుల మాటలు, దర్యాప్తులో బయటపడ్డ విషయాలతో భారత్‌లో జరిగిన ఉగ్రదాడుల వెనుక పాకిస్థాన్ హస్తముందనే విషయం తేటతెల్లమైంది. అందువల్ల అంతర్గత వైఫల్యాలు, ఉగ్రదాడిలో తమ పాత్రనుంచి ప్రపంచం దృష్టిని మరల్చడంపై పాకిస్థాన్ ఇప్పుడు దృష్టి పెట్టినట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే పాక్ మంత్రులు, ఆ సైన్యం పదేపదే కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నట్టు అర్థమవుతున్నది. పాక్ రెచ్చగొట్టినంత మాత్రాన రెచ్చిపోకుండా భారత్ చాలా పరిణతితో వ్యవహరిస్తూ సంయమనం పాటిస్తున్నది. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సూపర్ క్యాబినెట్, భద్రతా వ్యవహారాల క్యాబినెట్, ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ, కేంద్ర క్యాబినెట్ సమావేశమైనాయి. పహల్గామ్ ఉగ్రదాడి కేసులో ఇప్పటి వరకు 2500 మంది అనుమానితులను ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. అందులో సుమారు 186 మందిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. ఉగ్ర ఘటనకు ముందు, ఘటన జరిగిన రోజు బైసరన్ వ్యాలీలో ఉన్న పర్యాటకులు, ప్రత్యక్ష సాక్షులు, జిప్ లైన్ ఆపరేటర్లు, హోటల్ యజమానులు, టూరిస్ట్ గైడ్స్, పర్యాటకులు ఇచ్చిన వాంగ్మూలాలు, పర్యాటకులు తీసిన వీడియోల ఆధారంగా కేసు దర్యాప్తు ముందుకు తీసుకెళ్తోంది. అందులో భాగంగానే పాక్ ఉగ్రవాదులకు సహకరించే స్థానిక ఓవర్ గ్రౌండ్ వర్కర్స్ దాదాపు 20 మందిని ఎన్ ఐఏ అరెస్ట్ చేసింది. అందులో నలుగురు పాకిస్తాన్ ఉగ్రవాదులకు సహాయం చేశారని ఎన్ ఐఏ దర్యాప్తులో వెల్లడైంది. దాడికి రెండు రోజుల ముందు ఉగ్రవాదులు బైసరన్ లోయలో ఉన్నారని ఎన్ ఐఏ గుర్తించింది. ఏప్రిల్ 15న ఉగ్రవాదులు పహల్గామ్ చేరుకున్నారని, రెండు రోజుల పాటు బైసరన్ వ్యాలీలో ఉన్నారని వర్గాలు గుర్తించాయి. ఏప్రిల్ 22న ఉగ్రదాడి జరిగిన బైసరన్ లోయం కాల్పుల్లో 28 మంది పర్యాటకులు చనిపోయారు.. అయితే ఉగ్రవాదుల లక్ష్యం భారీ ప్రాణ నష్టం ఈ ఒక్క ప్రాంతమే కాకుండా మరో మూడు ప్రదేశాల్లో ఉగ్రవాదులు రెక్కీ నిర్వహించినట్లు ఎన్ ఐఏ దర్యాప్తులో తేలింది. అరు లోయ, అమ్యూజ్‌మెంట్ పార్క్, బేతాబ్ లోయ ఈ మూడు ప్రదేశాలు లక్ష్యంగా ఉన్నప్పటికీ భద్రతా కారణాల దృష్ట్యా, దాడి జరపలేకపోయారని ఎన్ ఐఏ దర్యాప్తులో తేలింది. లోయలో మూడు సాటిలైట్ ఫోన్‌లను ఉపయోగించినట్లు.. వాటి సిగ్నల్ ఆధారాలను ఎన్ ఐఏ సేకరించింది. ప్రస్తుతం పెహల్గాం చేరుకున్న ఎన్ ఐఏడీజీ సదానంద డేట్ సహా ఉన్నతాధికారులు కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారుపుల్వామా ఉగ్రదాడి తర్వాత సీసీపీఏ సమావేశం జరగడం ఇదే తొలిసారి. వీటిని పరిశీలిస్తే పాక్‌పై ఇప్పటికే దౌత్యపరంగా చర్యలు తీసుకున్న భారత ప్రభుత్వం ఉగ్రవాదులతోపాటు దాయాది దేశానికి తగిన బుద్ధి చెప్పడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్టు అర్థమవుతున్నది.

## 'కొత్తగూడెం మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి'



కొత్తగూడెం అర్బన్, మే 02 : కొత్తగూడెం మున్సిపాలిటీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కోడూరు సుజాతను కలిసి విన్నవించారు. వివిధ వార్డుల్లో మంజూరైన కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం వెంటనే చేపట్టాలని, వార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వీధి కుక్కలు, కోతుల బెడదను తగ్గించాలని, పారిశుధ్య కార్మికులు, ట్రాలీ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, "మహిళా శక్తి" క్యాంటీన్ లకు రుణాలు మంజూరు చేయాలన్నారు. రాజీవ్ పార్కులో లైటింగ్ వ్యవస్థను మరమ్మతు చేయాలని, ఓపెన్ జిమ్, త్రాగునీరు, టాయిలెట్స్ సౌకర్యాలను కల్పించాలని, సింగరేణి ప్రధాన ఆస్పత్రి వద్ద నిర్మించిన ఫౌంటెన్ ఔట్ లెట్ పనులు, వివిధ వార్డుల్లో డ్రైనేజీ, రోడ్లు, కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే మంచినీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని బోర్లు వేయించి, మినీ వాటర్ ట్యాంకులకు రిపేర్లు చేయించి నీటి కొరత తీర్చాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన టీఎస్ బీపాస్ పద్ధతిలో ఇంటి నిర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంటే 1985లో చెల్లించిన ఇంటి పన్నుల బిల్లు తేవాలని అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, లేకుంటే ఎల్ఆర్ఎస్ చెల్లించాలని ఆదేశిస్తున్నారని, తద్వారా ఇంటి యజమాని అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. 16వ వార్డులో అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో నెలకొన్న సమస్యలను తీర్చాలని, వైకుంఠ ధామాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని తదితర సమస్యలను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ ఆధ్వర్యంలో కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కమిషనర్ త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, మాజీ కౌన్సిలర్లు రుక్మాంగధర్ బండారి, వేముల ప్రసాద్ బాబు, అంబుల వేణుగోపాల్, పల్లపు రాజు, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు. అనంతరం కొత్తగూడెం మండల తాసీల్దార్ దొడ్డి పుల్లయ్యను కలిసి సమస్యలను ప్రస్తావించారు. పట్టణంలో క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్ 76 దరఖాస్తు చేసుకున్న ఇండ్లకు సర్వే పూర్తి చేశారని, ఇప్పటి వరకు పట్టాలివ్వకుండా నిలిపివేశారని, వెంటనే పట్టా పంపిణీ ప్రక్రియ చేపట్టాలను కోరారు. రేషన్ కార్డుల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఆయన బీఆర్ఎస్ నాయకులకు హామీ ఇచ్చారు.

## ఉగ్రవాద సంస్థలతో పాక్ సంబంధాలు నిజమే : బిలావల్ భుట్టో



న్యూఢిల్లీ: ఉగ్రవాదుల విషయంలో పాకిస్థాన్ మరోసారి నిజాలు వెళ్లగక్కింది. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనంటూ ఆ దేశ విదేశాంగ శాఖ మాజీ మంత్రి, పాక్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో అంగీకరించారు. ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం, నిధులు సమకూర్చడంలో పాకిస్థాన్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని స్వయంగా ఆ దేశ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవలే అంగీకరించిన విషయం తెలిసిందే. తాజాగా బిలావల్ భుట్టో కూడా ఇదే విషయాన్ని అంగీకరించారు. రక్షణ మంత్రి చెప్పిన ప్రకారం.. పాక్‌కు గతం ఉందనేది రహస్యం కాదని తాను భావిస్తున్నట్లు చెప్పారు. దాని ఫలితంగా పాక్ చాలా నష్టపోయిందన్నారు. ఆ పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి అంతర్గత సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. పాకిస్థాన్ తీవ్రవాద చరిత్ర తిరస్కరించలేనిదని వ్యాఖ్యానించారు. అయితే, అది తమ దేశ చరిత్రలో ముగిసిన అధ్యాయమని.. ఒక దురదృష్ట భాగం అని పేర్కొన్నారు.

ఉగ్రవాదాన్ని పెంచి పోషించాం : పాక్ రక్షణ మంత్రి

ఉగ్రవాదులను పెంచి పోషించినట్లు ఆ దేశ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ మీడియా సాక్షిగా ఒప్పుకున్న విషయం తెలిసిందే. పెహల్‌గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై 'స్కై న్యూస్' మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నలు సమాధానాలిచ్చారు. ఉగ్ర సంస్థలకు నిధుల సమీకరణ, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటి అంశాలపై జర్నలిస్ట్ ప్రశ్నించగా.. ఆయన అసలు విషయం బయటపెట్టారు. 'అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు వేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం' అని కుండ బద్దలు కొట్టారు. ఇలాంటి పనులు చేయడం పొరపాటు అని తర్వాత అర్థమైనట్లు చెప్పారు. ఆ పనులు చేయడం వల్ల తమకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు చెప్పుకొచ్చారు. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో తాము చేరకపోయి ఉంటే.. పాకిస్థాన్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డు ఉండేదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ లేదని తెలిపారు. 'లష్కరే అనేది పాత పేరు. అది ఇప్పుడు ఉనికిలో లేదు. దాని అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ గురించి నేను ఎప్పుడూ వినలేదు' అని పేర్కొన్నారు.

## దోస్త్ షెడ్యూల్ విడుదల.. రేపట్నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల నిమిత్తం దోస్త్ షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ. 200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. మే 29న ఫస్ట్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్ జరగనుంది. ఫస్ట్ ఫేజ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు మే 30 నుంచి జూన్ 6వ తేదీలోపు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెకండ్ ఫేజ్ దరఖాస్తుల ప్రక్రియ మే 30 నుంచి జూన్ 8 వరకు కొనసాగనుంది. సెకండ్ ఫేజ్‌లో కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారు రూ. 400 చెల్లించాల్సి ఉంటుంది. మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జూన్ 13న రెండో దశ సీట్లు కేటాయించనున్నారు. జూన్ 13 నుంచి 18వ తేదీ లోపు ఆయా కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. థర్డ్ ఫేజ్ దరఖాస్తుల ప్రక్రియ జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు కొనసాగనుంది. రిజిస్ట్రేషన్‌కు రూ. 400 చెల్లించాలి. జూన్ 13 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. జూన్ 23న సీట్ల కేటాయింపు జరగనుంది. జూన్ 23 నుంచి 28 వరకు కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 30 నుంచి డిగ్రీ ఫస్టియర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.




## దేశంలో కులగణన చారిత్రాత్మకమైన నిర్ణయం : బీజేపీ



నాగర్ కర్నూల్ : దేశంలో జనగణన తోపాటు కులగణన చేయడం చారిత్రాత్మకమైన నిర్ణయమని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ మలికేడి అన్నారు. బీజేపీ నాగర్ కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 60 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు జనాభా ప్రకారం రిజర్వేషన్ల ఇవ్వడం గొప్ప విషయమని అన్నారు. ఈ నిర్ణయం ఓబీసీలకు గొప్ప గుర్తింపని పేర్కొన్నారు. రాజకీయ సామాజిక విద్య ఉద్యోగాల పరంగా ఓబీసీలకు అవకాశాలు మరింత పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమం లో టౌన్ అధ్యక్షులు రాము, ప్రధాన కార్యదర్శి ప్రమోద్, కుమార్, సైదులు, జిల్లా ఆఫీస్ సెక్రటరీ చందు, సీనియర్ నాయకులు యాదగిరిరావు, నాగేంద్ర గౌడ్ తాడుర్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్, బీజేవైఎం టౌన్ అధ్యక్షులు చందు, టౌన్ ఉపాధ్యక్షులు పర్వతాలు, ఓబీసీ నేత లక్ష్మయ్య, సూరంపల్లి సుధాకర్, భూత్ అధ్యక్షులు, జజాల కృష్ణ, పరశురామ్, బాలరాజు, సంజయ్, భీమయ్య సూరి బాబు, పాస్తాం బాబు తదితరులు పాల్గొన్నారు


## 'స్వచ్ఛ మునుగోడు'కు కృషి చేయాలి : ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, మే 02 : స్వచ్ఛ మునుగోడు కార్యక్రమాన్ని తీసుకుని నియోజకవర్గ వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నియోజకవర్గ సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు, నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి మునుగోడులోని అధికారిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి, మురుగు కాల్వల నిర్వహణ సరిగా ఉండకపోవడం వల్ల దోమలు ఎక్కువై ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నట్లు తెలిపారు. పల్లెలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. మనిషి ఎక్కువగా అనారోగ్యం పాలు కావడానికి కారణం త్రాగునీరు సరిగా లేకపోవడం అని కావునా త్రాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే ప్రభుత్వంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నియోజకవర్గ ముఖ్య నాయకులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. గ్రామ పంచాయతీలో చేపట్టే అక్రమ నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శులు అడ్డగోలుగా అనుమతులు ఇవ్వొద్దని ఎమ్మెల్యే సూచించారు. మునుగోడు నియోజకవర్గంలోని ఏడు గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుని మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. మునుగోడులో బెల్ట్ షాపుల నిర్మూలనకు ప్రతి ఒక్కరం ఏ విధంగానైతే ఉద్యమం చేసి వాటిని నిర్మూలించామో అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్లాస్టిక్ నిర్మూలనకూ ప్రతి ఒక్కరం కంకణ బద్ధులై పనిచేయాలని కోరారు. గ్రామ పంచాయతీ విస్తీర్ణాన్ని బట్టి ఆ విస్తీర్ణంలో 10 శాతం చెట్లను పెంచే విధంగా ప్రణాళికలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన డీపీఓలు, డీఎల్పీఓలు, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ముఖ్య నేతలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



## ఐదేళ్లలో 119 మంది వైద్య విద్యార్థుల ఆత్మహత్య.. 1,116 మంది డ్రాపవుట్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 119 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 64 మంది ఎంబీబీఎస్ అండర్ గ్రాడ్యుయేట్లు, 55 మంది పీజీ మెడికల్ విద్యార్థులు. అలాగే గత ఐదేళ్లలో 1,116 మంది వైద్య విద్యార్థులు చదువును మధ్యలోనే వదిలేశారు. వీరిలో 160 మంది అండర్ గ్రాడ్యుయేట్లు, 956 మంది పీజీ విద్యార్థులు. యునైటెడ్ డాక్టర్స్ ఫ్రంట్ (యూడీఎఫ్) నుంచి సమాచార హక్కు (ఆర్టీఐ) ద్వారా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఈ సమాచారాన్ని సేకరించింది. యువ వైద్య విద్యార్థుల ఆత్మహత్యలు, వైద్య విద్యను మధ్యలోనే వదిలేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కాగా, 2018 నుంచి 2022 వరకు 64 మంది ఎంబీబీఎస్, 58 మంది పీజీ విద్యార్థులు సూసైడ్ చేసుకున్నట్లు గత ఆర్టీఐ డాటా ద్వారా వెల్లడైంది. అలాగే 2020-2022 మధ్య 531 వైద్య కాలేజీల్లో సుమారు 68 మంది వైద్య విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎన్ఎంసీ గతంలో నివేదించింది. మరోవైపు యువ వైద్యులపై విద్య, పరీక్షల ఒత్తిడి, తగినంత విశ్రాంతి లేకపోవడం, ప్రతికూల పని వాతావరణం, పని భారం, ఎక్కువ అంచనాలు, తీవ్రమైన మానసిక ఒత్తిడి వంటివి ఆత్మహత్యలు, డ్రాపవుట్‌కు ప్రధాన కారణంగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో పని గంటలు తగ్గించడం, వైద్య విద్యార్థులను పర్యవేక్షించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటి చర్యలు చేపట్టాలని సీనియర్ వైద్యులు సూచించారు. కాగా, మెడికల్ కాలేజీల నిర్వహణ, నిర్లక్ష్యంపై ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులు సుమారు 1680 ఫిర్యాదులు చేసినట్లు ఈ సమాచారం ద్వారా వెలుగులోకి వచ్చింది. దీంతో మెడికల్ కాలేజీల్లో వేధింపులు, ర్యాగింగ్‌ను నిరోధించాల్సిన అవసరాన్ని ఇది స్పష్టం చేస్తున్నదని సీనియర్ డాక్టర్లు వెల్లడించారు.



# రాజకీయాలకు బుట్టా గుడ్ బై



కర్నూలు, మే 2,వ్యాపార రంగంలో ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. పారిశ్రామిక, వ్యాపార రంగాల నుంచి రాజకీయాల వైపు వచ్చినవారు చాలా అప్రమత్తంగా ఉంటారు. పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు. లేకుంటే ఇబ్బందులు తప్పవని వారికి తెలుసు. అయితే ఈ విషయంలో మూల్యం చెల్లించుకున్నారు మాజీ ఎంపీ బుట్టా రేణుక. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రేణుక 2014 ఎన్నికల్లో కర్నూలు ఎంపీగా గెలిచారు. అత్యంత సీనియర్ నేతగా ఉన్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ని ఓడించి లోక్ సభలో అడుగుపెట్టారు. అటు తరువాత రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలు ఆమె పాలిట శాపంగా మారాయి.2014లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం గౌరవప్రదమైన స్థానాలను తెచ్చుకొని ప్రతిపక్షంగా ఉంది. బుట్టా రేణుక ఎంపీగా గెలిచి పార్లమెంట్లో అడుగుపెట్టారు. విద్యాధికురాలిగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా గుర్తింపు పొందారు రేణుక. అయితే 2018లో ఆమె టిడిపిలో చేరాలని నిర్ణయించుకున్నారు. అక్కడ నుంచి ఆమె కౌంట్ డౌన్ మొదలైంది. తెలుగుదేశం పార్టీలో చేరినా.. ఆమెకు కోరుకున్న సీటు దక్కలేదు. కనీసం ఎక్కడా సర్దుబాటు కూడా చేయలేదు. దీంతో టీడీపీలోకి వచ్చినట్టే వచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి వెళ్ళిపోయారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకొనసాగి ఉంటే 2019లో సైతం ఆమెకే కర్నూలు పార్లమెంట్ టికెట్ ఇచ్చేవారు. టిడిపిలోకి వెళ్లి తిరిగి రావడంతో ఆమెకు టికెట్ నిరాకరించారు జగన్మోహన్ రెడ్డి. 2019 నుంచి 2024 మధ్య ఆమె పార్టీకి తన సమయాన్ని కేటాయించాల్సి వచ్చింది. అయితే అధినేతను ఎలాగోలా ఒప్పించి 2019లో ఎమ్మిగనూరు అసెంబ్లీ టికెట్ ఇప్పించుకున్నారు రేణుక. సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని తప్పించి మరి జగన్ ఆమెకు టికెట్ ఇచ్చారు. బీసీ తారక మంత్రం పనిచేస్తుందని భావించారు. కానీ కూటమి ప్రభంజనంలో బుట్టా రేణుక ఓడిపోయారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి రూపంలో ఆమెకు వ్యతిరేక వర్గం ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఆ వర్గం వ్యతిరేకించింది. ప్రస్తుతం కూడా వ్యతిరేకిస్తూనే ఉంది. ఇంకోవైపు వ్యాపారంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆమె ఆస్తులు వేలానికి సిద్ధంగా ఉన్నాయి. అటు రాజకీయంగా కలిసి రాక.. ఇటు వ్యాపార పరంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అయితే రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వ్యాపార రంగం తిందని ఆమె బాధపడుతున్నారు. అందుకే రాజకీయాలనుంచి నిష్క్రమించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి ఆమె నిర్ణయం ఎలా ఉంటుందో.

# బొబ్బిలి యుద్ధంలో నెగ్గిన కూటమి

విజయనగరం, మే 2, విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు కూటమి నేతలు. అందుకోసం పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకున్నారు. ఎలాగైనా మున్సిపల్ పీఠం దక్కించుకోవాలని కూటమి నేతలు, తమ పీఠాన్ని పదిలపరచుకోవాలని వైసీపీ నేతలు ఎవరికి వారే పక్కా స్కెచ్ తో క్యాంప్ పొలిటికల్స్కి తెరలేపినా చివరికి కూటమి నేతలే నెగ్గారు. ఈ అంశంతో విజయనగరం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా రసవత్తరంగా మారాయి.నాలుగేళ్ల క్రితం వైసీపీ దక్కించుకున్న బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ పదవిని ఇప్పుడు అధికార కూటమి దక్కించుకునేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీపై ఎలాగైనా తమ జెండా ఎగురవేయాలని కూటమి చేసిన ప్రయత్నం సక్సెస్ ఫుల్ గా నెరవేరింది. అవిశ్వాసానికి కావలసిన మ్యాజిక్ ఫిగర్ ను సొంతం చేసుకునేందుకు ముందుగానే వైసీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉండగా, అవిశ్వాస తీర్మానంలో చైర్మన్ కు వ్యతిరేకంగా 20 మంది ఓటేస్తే వైసీపీ చైర్మన్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. అనంతరం 16 మంది చేతులెత్తి కొత్త చైర్మన్ ను ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది.బొబ్బిలి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 31 వార్డులుండగా, వాటిలో పది వార్డులను టీడీపీ, 20 వైసీపీ, ఒక వార్డు ఇండిపెండెంట్ కైవసం చేసుకున్నారు. అయితే ఆ తరువాత ఒక వైసీపీ సభ్యుడు రాజీనామా చేయడంతో బొబ్బిలిలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఇండిపెండెంట్ తోపాటు మరో 9 మంది వైసీపీ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో టీడీపీ బలం 20కి చేరింది. ఎమ్మెల్యే బేబీనాయన ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఓటు హక్కు ఉండటంతో అవిశ్వాసం తీర్మానం నెగ్గటానికి ఎలాంటి ఢోకా లేదు. అవిశ్వాసానికి కావలసిన 20 మంది కౌన్సిలర్లు కూటమికి ఉండటంతో ఓటింగ్ సమయానికి వారిలో ఏ ఒక్కరు చేజారిపోకుండా క్యాంప్ పాలిటిక్స్ కి తెరలేపారు కూటమి నేతలు. వైసీపీ నుండి మద్దతు ఇస్తున్న తొమ్మిది మంది, ఒక ఇండిపెండెంట్ తోపాటు టీడీపీకి చెందిన10 మంది కౌన్సిలర్లను క్యాంప్లో ఉంచి నేరుగా ప్రత్యేక బస్సులో బొబ్బిలి మున్సిపల్ సమావేశ మందిరంకి తీసుకువచ్చారు. అయితే ఈ అవిశ్వాస తీర్మానంకు వైసీపీకి చెందిన మిగిలిన పది మంది కౌన్సిలర్లు కూడా హాజరయ్యారు. ఇక మునిసిపల్ సమావేశం ప్రారంభమైన తరువాత అవిశ్వాస తీర్మానం ప్రారంభించారు ఎన్నికల అధికారులు. అలా పెట్టిన అవిశ్వాసంలో కూటమి సభ్యులు 20 మందితో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడు ఎమ్మెల్యే బేబీనాయన కూడా అవిశ్వాస తీర్మానంకి అనుకూలంగా ఓటేయడంతో 21 ఓట్లతో అవిశ్వాసం నెగ్గి ప్రస్తుత చైర్మన్ సావు మురళీ కృష్ణ తన పదవిని కోల్పోయారు. ఆ తరువాత కొత్తగా ఎన్నుకోబోయే నూతన చైర్మన్ ఎవరు అన్న చర్చ కూడా జోరుగా సాగుతుంది. ఇక బొబ్బిలి మున్సిపాలిటీకి టీడీపీ సభ్యుడిని నూతన చైర్మన్ గా ఎన్నిక కావడం లాంఛనమే అయ్యింది.

# వైసీపీ ప్రక్షాళన దిశగా అడుగులు

విజయవాడ, మే 2, వైసీపీని ప్రక్షాళన చేసే పనిలో ఆపార్టీ అధినేత జగన్ తలమునకలయ్యారట. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో జగన్ అడుగులు ముందుకు వేస్తున్నారని ఫ్యాన్ పార్టీలో చర్చ నడుస్తోంది. సరికొత్త వ్యూహాలకు పదును పెడుతూ పార్టీని ముందుకు నడిపించాలని జగన్ డిసైడ్ అయ్యారట. ఇప్పటివరకు ఒక లెక్క..ఇప్పుడు ఒక లెక్క అన్నట్లుగా జగన్ పార్టీలో కీలక సంస్కరణలను చేపట్టబోతున్నారని పార్టీవర్గాల్లో టాక్ విన్పిస్తోంది. ఇకనుంచి పార్టీలో వికేంద్రీకరణ విధానం తీసుకురావాలని చూస్తున్నారట.వైసీపీలో దిగువ స్థాయి నుంచే పార్టీ ఎదగాలని వారే బాధ్యులుగా మారి సమర్ధంగా పనిచేయాలని ఆయన గట్టిగా కోరుకుంటున్నారు. అందుకే మొన్నటి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చేసిన సూచనలు..నేడు జిల్లా అధ్యక్షులు సమావేశంలో ఇస్తున్న దిశానిర్దేశం రెండింటిని పరిశీలిస్తే..పార్టీని నాయకులకే అప్పగిస్తున్నారన్న టాక్ పార్టీవర్గాల్లో విన్పిస్తోంది.జగన్ అధ్యక్షతన జరిగిన జిల్లా అధ్యక్షుల సమావేశంలో..పార్టీకి జిల్లా అధ్యక్షులే సర్వస్వం అన్నారట. మీరే పార్టీ..పార్టీనే మీరు అని క్లారిటీగా చెప్పేశారు. మీరే అన్ని రకాల బాధ్యతలు తీసుకోవాలని..ఎవరి కోసమో చూడొద్దని సూచించారు. మీకు ఎవరైనా ఆదేశిస్తారేమో అని ఎదురుచూడకుండా సొంత నిర్ణయాలు తీసుకోండి అని జగన్ ఫుల్ ఫ్రీడం ఇచ్చారట. జిల్లా పార్టీకి మీరే యజమానులు..మీ మాటే చెల్లుబాటు అవుతుంది.మీరే మొత్తం జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని గెలిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జ్ తో కలుపుకుని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అసెంబ్లీ పరిధిలో రెండు వర్గాలు ఉంటే వారిని కో ఆర్డినేట్ చేసి సమస్యలను పరిష్కారించుకోవాలని సూచించారని సమాచారం. అంతేకాదు బాగా



పనిచేయని ఇంచార్జిల విషయంలో కూడా ఒకటికి పదిసార్లు పరిశీలన చేసి..ఆ తర్వాత వారు దారికి రాకపోతే మార్చేసే విషయంలోనూ మీదే కీలకపాత్ర అన్నారు.జగన్ ఇంతలా వారి మీదనే ఎందుకు బాధ్యతలు మోపుతున్నారన్న చర్చ పార్టీ నేతల్లో మొదలైందట. పీఏసీ సభ్యులకూ ఇదే విధంగా సూచించారట. అలాగే జిల్లా అధ్యక్షుల విషయంలో ఈ విధంగానే చెబుతున్నారు. దీంతో జగన్ అధికారాలను వికేంద్రీకరించి పార్టీని గ్రాస్ రూట్ లెవెల్ దాకా తీసుకెళ్ళాలని అనుకుంటున్నారా అన్న చర్చ సాగుతోంది. పార్టీ అధినేత జగన్ అన్నీ ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నారని పార్టీ నేతలు చెప్తున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తోంది.ఒకవైపు వైసీపీ ముఖ్య నేతలు వరుసగా అరెస్ట్ అవుతున్నారు. పైనున్న పెద్దలు దాకా కూడా ఈ అరెస్టులు రావచ్చు అన్న చర్చ సైతం పార్టీలో సాగుతోందట. అందుకే జగన్ అన్నీ చూసుకునే పార్టీని సమిష్టిగా నాయకులు అంతా కలసి నడిపే విధంగా ఈ కొత్త రకమైన రూపుని పార్టీకి అందిస్తున్నారని అంటున్నారు. ఏవైనా అనుకోని అవాంతరాలు ఏర్పడినా ఇబ్బందులు లేకుండా పార్టీ ముందుకు సాగాలని జగన్ ఆలోచిస్తున్నారని అంటున్నారు. పార్టీలో గత పరిస్థితులు ఇపుడు లేవని..అందుకే ఈ నిర్ణయం తీసుకున్నారనే గుసగుసలు పార్టీవర్గాల్లో విన్పిస్తున్నాయి.ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తట్టుకుని నిలబడేలా క్యాడర్ బేస్డ్ గా లీడర్ ఓరియేంటెడ్ గా పార్టీని తీర్చిదిద్దాలని జగన్ చూస్తున్నారని టాక్. మరి ఈ కొత్త రకమైన విధానం సక్సెస్ అయితే ఓకే గానీ, చిక్కల్లా అందరికీ బాధ్యతలు ఇస్తే ఎవరు ఏంచేస్తారో అన్న సందేహం పార్టీ అధినేత జగన్ ను వెంటాడుతోందట. ఏది ఏమైనా వైసీపీ అధినాయకత్వం పార్టీని పటిష్టపరిచేందుకు సరికొత్త ఆలోచనలు చేస్తున్నట్లు పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది

# టచ్ మీ నాట్ గా పవన్



గుంటూరు, మే 2, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజకీయాలను బాగానే అలవర్చుకున్నారు. టచ్ మి నాట్ గా ఉండటానికి అనేక కారణాలున్నాయంటున్నారు. ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితి కనుచూపు మేరలో బాగుపడే అవకాశం కనిపించడం లేదు. అప్పులు చేయాలి. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇచ్చిన హామీలను అన్నింటినీ అమలు చేయాలన్నా, నాలుగేళ్ల పాటు కొనసాగించాలన్నా చాలా కష్టమే. ఇప్పుడు సహకరించినట్లు కేంద్ర ప్రభుత్వం భవిష్యత్ లో సహకరించే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే దాని పరిమితులు దానికి ఉంటాయి. ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ మరింత టైట్ చేసే అవకాశం కేంద్రంలో కనిపిస్తుంది. తనపరిమితమవుతూ.. అందుకే పవన్ కల్యాణ్ ప్రతి విషయంలో పూసుకుని తిరగకుండా తన శాఖకే పరిమితమవ్వాలని నిర్ణయించుకున్నారు. కూటమి ప్రభుత్వమని అంటున్నా అది పూర్తిగా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడానికే వదిలేశారు. అంటే మంచి జరిగినా, చెడు జరిగినా అది చంద్రబాబు నాయుడు ఖాతాలోకే వెళుతుంది. అమరావతి విషయాన్ని తీసుకుంటే ఇంత నిధులు పెట్టి ఎందుకు ఖర్చు చేయడం అన్న ప్రశ్న జనసేనానిలోనూ ఉంది. కానీ అదే అమరావతి సక్సెస్ అయితే? అదే సంపద సృష్టించే కేంద్రంగా మారితే? అందుకే ఆయన ప్రతి విషయంలో మౌనం పాటించినట్లే రాజధాని అమరావతి నిర్మాణం విషయంలోనూ మౌనంగా ఉండాలని నిర్ణయించారట. మళ్లీ భూసేకరణపై... ఇటీవల చంద్రబాబు నాయుడు అమరావతి రైతులతో సమావేశమై మరో నలభై నాలుగు వేల ఎకరాల సమీకరణను చేయాలని, గ్రీన్ కోర్ ఎయిర్ పోర్టుతో పాటు అనేక వాటికి భూమి అవసరమని ఆయన రైతులతో చెప్పారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తొలుత సేకరించిన 33 వేల ఎకరాలే ఎందుకని ప్రశ్నించిన పవన్ కల్యాణ్ దానికి తోడు నలభై నాలుగు వేల ఎకరాలు సేకరించాలన్న చంద్రబాబు నిర్ణయాన్ని కూడా తప్పుపట్టలేదు. అలాగే బహిరంగంగా సమర్థించలేదంటున్నారు. మనకు సంబంధం లేని విషయంగా ఆయన వ్యవహరిస్తున్నట్లే కనపడుతుంది. భవిష్యత్ లో బూమ్ రాంగ్ అయినా తాను సమర్థించలేదని చెప్పుకోవడానికి వీలవుతుందని సైలెంట్ గా ఉన్నారనిపిస్తుంది. . ఎంత సింహాచలం ఘటనపై... ఒక్క అమరావతి మాత్రమే కాదు.. ఏ ఘటన జరిగినా పెద్దగా ఆయన స్పందించడం లేదు. తిరుమలలో తొక్కిసలాట జరిగినప్పుడు అక్కడకు వెళ్లి ఊగిపోయిన పవన్ కల్యాణ్ నిన్న సింహాచలంలో గోడకూలి ఏడుగురు మరణిస్తే అక్కడకు వెళ్లకపోవడానికి కూడా కారణమదే అంటున్నారు. తాను అక్కడకు వెళితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడాల్సి వస్తుందని, అందుకే అక్కడకు వెళ్లకుండా కామ్ గా ఉండి జరిగిన ఘటనను మాత్రం ఖండించారు. విచారాన్ని వెలిబుచ్చారు. పైగా హోంమంత్రి వంగలపూడి అనితను కూడా అక్కడ ఘటన జరిగిన తర్వాత తీసుకున్న చర్యలపై ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు. దీన్ని బట్టి పవన్ కల్యాణ్ కొంత దూరంగా ఉంటూనే పరిస్థితిని బట్టి తన మూవ్ అవ్వాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుందని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు.

# జగన్ అందుకే దూరమా



గుంటూరు, మే 2,వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రధాని మోదీ పర్యటనకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అయితే జగన్ తీసుకున్న నిర్ణయం ఎంత వరకూ కరెక్ట్ అన్న ప్రశ్న తలెత్తుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తుంటే ప్రధాని మోదీని కలిసే అవకాశాన్ని జగన్ తనంతట తానే వదులుకున్నారని కొందరు అంటున్నారు. అదే సమయంలో దూరంగా ఉండటమే మేలన్న అభిప్రాయమూ వ్యక్తమవుతుంది. రాజధాని అమరావతి పనులకు శంకుస్థాపనలు చేయడానికి ప్రధాని మోదీ వచ్చారు.అమరావతికి చేరుకుని కేవలం గంట నుంచి రెండు గంటలు మాత్రమే జగన్ తాడేపల్లిలోని తన ఇంట్లోనే ఉన్న జగన్ గురువారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరి వెళ్లడంతో ఆయన ప్రధానివోదీ పర్యటనకు హాజరు కూకడదని నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతుంది. ప్రొటోకాల్ అధికారులు జగన్ కు ప్రధాని మోదీ సభకు రావాలని ఆహ్వాన పత్రికను అందించడానికి తాడేపల్లి ఇంటికి వెళ్లినా జగన్ అందుబాటులో లేరని చెప్పడంతో దానిని ఆయన పీఏకు ఇచ్చి వచ్చారు. . సాయంత్రం 5.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి రాత్రి ఎనిమిది గంటలకు బెంగళూరుకు చేరుకోనుకున్నారు. జగన్ ప్రధాని మోదీ పర్యటనకు దూరంగా ఉండటానికి అనేక కారణాలున్నాయి.మామూలుగా పర్యటనకు వస్తే హాజరయినా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ తాను వ్యతిరేకించిన చోట అదే.. రాజధాని నిర్మాణాన్ని ఐదేళ్ల పాటు పక్కన పెట్టి, మూడు రాజధానులంటూ నినాదాన్ని అందుకున్న తాను ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడమే మంచిదన్న అభిప్రాయానికి జగన్ వచ్చి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని చెబుతున్నారు. ఒకవేళ ప్రధాని నరేంద్ర మోదీ కోసం వెళ్లి అవమానాల పాలు కావాల్సి వస్తుందేమోనన్న భయం కూడా జగన్ లో ఉంది. అందులోనూ తనకు నచ్చని, మెచ్చని అమరావతి పనులను ప్రారంభించే పనులకు హాజరైతే భవిష్యత్ లో రాజధాని విషయంలో అధికార పార్టీపై విమర్శలు చేయడానికి కుదరదన్న భావనతోనే జగన్ దూరంగా ఉన్నారని అంటున్నారు. జగన్ గా తాను వెళ్లినా.. వెళ్లకపోయినా అక్కడ పట్టించుకునే వారు పెద్దగా ఉండరు. అదే సమయంలో తాను హాజరయితే గత ఐదేళ్లు తాను చెప్పిన దానికి విలువ లేకుండా పోతుంది. మూడు రాజధానులంటూ వచ్చి అమరావతి పనుల నిర్మాణానికి ఎలా వచ్చారంటూ భవిష్యత్ లో జగన్ ను ప్రశ్నించే అవకాశం కూడా ఉంటుంది. అందుకే జగన్ ప్రధాని నరేంద్ర మోదీ కార్యక్రమానికి దూరంగా ఉండటమే మేలు అని నిర్ణయించుకుని ఒకరోజు ముందుగానే బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. రానున్న కాలంలో అమరావతి లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తనకు సంబంధం లేదన్న విషయాన్ని ఆయన స్పష్టం చేయడానికి అవకాశం దొరుకుతుందని కూడా అంచనా వేసుకుని ఆయన విమానమెక్కి వెళ్లిపోతున్నారు.

# కూటమి ప్రభుత్వానికి వెంటాడుతున్న ప్రమాదాలు

విశాఖపట్టణం, మే 2,ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయింది. పాలనాపరంగా ఇప్పుడిప్పుడే ప్రభుత్వం కుదుటపడుతోంది. మరోవైపు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భావిస్తోంది. అదే సమయంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధపడింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం అయ్యాయి. ఇటువంటి సమయంలో ఏపీలో విపత్తులు, వివాదాలు, ప్రమాదాలు ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పది నెలల్లోనే ఏపీ ప్రభుత్వం చాలా రకాల విపత్తులను ఎదుర్కొంది. ప్రభుత్వానికి అవి సవాల్ గా మారాయి. అయినా సరే కూటమి ప్రభుత్వం తట్టుకొని ముందుకు సాగుతోంది. సహజంగానే విపత్తులు, ప్రమాదాలను ప్రతిపక్షం రాజకీయం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుత జరుగుతున్నది అదే.గత ఏడాది జూన్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సెప్టెంబర్లో విజయవాడను బుడమేరు ముంచేసింది. దీంతో వేలాది కుటుంబాలు వరదల్లో చిక్కుకున్నాయి. లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారు. కనీసం ఆహారం కూడా వారికి దొరకని పరిస్థితి. అటువంటి సమయంలో సీఎం చంద్రబాబు నేనున్నాను అంటూ బాధితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. రోజుల తరబడి విజయవాడలోనే మకాం వేసి బాధితులకు స్వయంగా వరద నీటిలోనే వెళ్లి పరామర్శించారు. వారికి అన్ని విధాల సాయం చేశారు. రాత్రికి రాత్రి వరద బాధితులను ఆదుకునేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు వర్కౌట్ అయ్యాయి. అయితే ఈ కష్టం నుంచి బయటపడే క్రమంలో.. ఏలూరులోని ఎర్ర కాలువ పొంగింది. వేలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో ఇబ్బందులు తప్పలేదు. అటు తర్వాత ఫార్మా కంపెనీల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. విశాఖ జిల్లా అచ్యుతాపురం సమీపంలో ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఉద్యోగులతో పాటు కార్మికులు చనిపోయారు. అటు తర్వాత కాకినాడలోని పరిశ్రమలో సైతం ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల పరామర్శ, వారికి పరిహారం అందించడంలో ప్రభుత్వం ముందంజలో నిలిచింది. క్యాబినెట్ మంత్రులు సైతం నేరుగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ప్రభుత్వపరంగా అండగా నిలిచారు.ఈ ఏడాది జనవరిలో తిరుమల వెంకటేశ్వర స్వామి ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించి టోకెన్ల పంపిణీలో అపశృతి జరిగింది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో భక్తులు చనిపోయారు. ఇది పెను వివాదానికి దారితీసింది. మృతుల కుటుంబాలకు టీటీడీతో పాటు ప్రభుత్వం అండగా నిలిచింది. పరిహారం కూడా అందించింది. అంతకుముందు టీటీడీ లడ్డు ప్రసాదం వివాదం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది

## దెందులూరు నుంచి వేలాదిగా అమరావతికి తరలివెళ్లిన కూటమి శ్రేణులు, ప్రజలు

దెందులూరు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటనకు దెందులూరు నియోజకవర్గం నుంచి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలి వెళ్లారు. హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి బస్సులకు జెండా ఊపి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ప్రజల కోసం గన్నవరం వద్ద గల ఎస్ఎం కన్వెన్షన్ హాల్లో భోజన సౌకర్యాలను కూడా ఏర్పాటుచేసారు.నియోజకవర్గ పరిధిలోని దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల నుంచి అమరావతి రాజధానికి కూటమి, నాయకులు, కార్యకర్తలు ప్రజలు వేలాదిగా తరలివెళ్లారు.

## నీట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించండి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02 - దేశ వ్యాప్తంగా నిర్వహించే నీట్ పరీక్షలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్ల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. సమావేశంలో నీట్ పరీక్షల సిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈ నెల 4వ తేదీన నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (నీట్) పరీక్షలు జిల్లాలో ప్రథమంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్ లను ఆదేశించారు. జిల్లాలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బస్టాండ్ సమీపంలో ఉన్న గవర్నమెంట్ హై స్కూల్, టేక్కే జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తదితర కళాశాలలో 1172 మంది విద్యార్థులు నీట్ పరీక్షలకు హాజరవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షకు వచ్చే విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఆధార్, పాన్, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్ తదితర గుర్తింపు కార్డులతో పాటు పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. మ.2.గం.ల నుంచి సా.5.గం.ల వరకు ఆఫ్ లైన్ విధానంలో పరీక్ష జరగనున్నందున ఉ.11 గం.ల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. మ.1.30.గం.ల తరువాత విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదన్నారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రతి పరీక్షా కేంద్రంలో 2 వీల్ చైర్లను ఏర్పాటు చేయాలన్నారు.

## ఆర్ ఓ గా బాధ్యతల స్వీకరణ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02- నంద్యాల మున్సిపాల్టీ లో అర్ ఓ గా ఎస్ వెంకట రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన డోన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఉన్న ఆర్ ఓ అంజనేయులు మార్కాపురం కు బదిలీ అయ్యారు. మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేసారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ ను కలసారు.అర్ ఓ వెంట శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ ఉన్నారు.

## మహానంది క్షేత్రంలో ఆదివారం వార్షిక గంగా పుష్కరోత్సవము



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 02- మహానంది క్షేత్రంలోని నందితీర్థంలో వైశాఖ శుద్ధ సప్తమి నాడు జరిగే అద్భుతం అమోఘమైనది. ఆదివారం గంగాదేవి స్వయంగా ఇక్కడి తీర్థానికి చేరుకుని సంకల్ప స్నానమాచరించి శుద్ధిని పొందుతుందని స్వయంగా పురాణేతిహాసాలు చెబుతున్నాయి. అంతటి మహిమాన్వితమైన నందితీర్థమనే రుద్రగుండంలో స్నానం చేసే భక్తులకు కలిగే ప్రయోజనాలు అనంతం.దేవతలు, మహర్షులు,మానవులు గంగలో స్నానం చేసి సమస్త పాపములను పోగొట్టుకుంటూ ఉంటారు.

## అగ్ని ప్రమాదంలో పశుగ్రాసం నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి




ఉండవెల్లి: జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ప్రాగటూరు గ్రామంలో మే ఒకటో తేదీ అర్ధరాత్రి గ్రామానికి చెందిన 12 మంది రైతులకు చెందిన పశు గ్రాసం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని కాలిపోయింది ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటనలో పశుగ్రాసం వరిగడ్డి మినప పొట్టు పెసర పొట్టు, బుడ్డల కట్టే కందిపొట్టు తదితర పశుగ్రాసం కాలి పోయిన సంఘటన తెలుసుకుని గ్రామానికి వెళ్లిజిల్లా కమిటీ సభ్యులతో కలిసి కాలిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన 12 మంది రైతులకు చెందిన 18 వాములు పూర్తిగా మంటల్లో దగ్ధమయ్యాయని దాదావు ఇరవై ఐదు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని, వాటి తోపాటు వ్యవసాయ పనిముట్లు ఎద్దుల బండ్లు నీటి పంపు మోటర్లు పైపులు తదితర సామాగ్రి కాలి బూడిదైందని పశువుల పాకలో కట్టేసిన పశువులు మంటల వేడికి తట్టుకోలేక అర్ధరాత్రి తాళ్లు తెంపుకొని వెళ్లాయని కొన్ని పశువులకు మంట సెగ తగిలి బొబ్బలు వచ్చాయని ఈసంఘటనలో పూర్తిగానష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం పూర్తిస్థాయిలో ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాస్ సింగరాజు మద్దిలేటి జీకే ఈదన్న మండల కమిటీ సభ్యుడు ఎం వెంకటేశ్వర్లు శాఖ కార్యదర్శి కే మధు రంగన్న చెన్నరాయుడు హుస్సేను తదితరులు ఉన్నారు.

## నంద్యాల జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధుల మంజూరు.- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



కర్నూలునంద్యాల జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి శుక్రవారం అమరావతిలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడం జరుగుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ రూ.967 కోట్లతో నంద్యాల - యర్రగుంట్ల మధ్య రైల్వే లైన్ ఏర్పాటు,రూ.2.25 కోట్లతో కొనసాగుతున్న 3 పార్కుల అభివృద్ధి పనులు, రూ.39.89 కోట్లతో నంద్యాల - డోన్ మధ్య రోడ్డు ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు, అమృత్ పథకం కింద 5047 కుళాయి కనెక్షన్లు జిల్లాలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, నంద్యాల జిల్లా అభివృద్ధికి నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐ టీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ధన్యవాదములు చెప్పారు.

## శ్రీశైలంలో కన్నుల పండుగగా శ్రీ స్వామి అమ్మవార్ల స్వర్ణ రథోత్సవం

శ్రీశైలం మే 2 ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాడు కన్నుల్లో పండుగగా శ్రీశైలం మహాక్షేత్రంలో శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది.కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది.ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.అనంతరం ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి గంగాధర మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది.సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, డోలు వాయిద్యం మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి.ఈనాటి స్వర్ణరథోత్సవంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి వి.రమణమ్మ, సహాయ కమీషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ఎం. నరసింహారెడ్డి, పర్యవేక్షకులు ఎం. మల్లికార్జున, అర్చకస్వాములు, వేదపండితులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.





## పాలధార పంచదార శ్రీ ఆదిశంకరాచార్యుల వైభవంగా జయంతి



విభారె న్యూస్ శ్రీశైలం మే 2 వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా శుక్రవారం నాడు ఆదిశంకరుల వారి జయంతి ఉత్సవం నిర్వహించబడింది. ఈ జయంతి ఉత్సవంలో భాగంగా ఫాలధార - పంచధారల వద్ద గల శంకరమందిరంలో ప్రత్యేక పూజలు జరిపించబడ్డాయి.ఈ పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ ఆలయ అర్చకులు, వేదపండితులు మహాగణపతిపూజను నిర్వహించారు. తరువాత వేదమంత్రాలతో చంద్రమౌళీశ్వరస్వామి వారికి, శ్రీ శారదాదేవికి, శంకరులవారికి విశేషంగా అభిషేకం జరిపించబడింది. పంచామృతాలతోనూ, వివిధ ఫలరసాలతోను, పుణ్యజలంతోను ఈ అభిషేకం ఎంతో శాస్త్రోక్తంగా చేయబడింది. తరువాత పుష్పార్చన, మహానివేదనలను చేయడం జరిగింది.కాగా ఆదిశంకరులవారికి, శ్రీశైలక్షేత్రానికి చాలా దగ్గరి సంబంధం ఉంది. శంకరులవారు శ్రీశైలంలోని పాలధార -పంచధార వద్ద కొంతకాలం తపస్సు చేసి ఇక్కడే తమ శివానందలహరి గ్రంథాన్ని రచించారు. ఈ శివానందలహరిలో శ్రీశైలక్షేత్రాన్ని, శ్రీభ్రమరాంబా మల్లికార్జునులను స్తుతించారు. అదేవిధంగా శంకరులవారు యోగతారావళి అనే గ్రంథంలో శ్రీశైలంలోనే సమాధిని పొందాలని అభిలషించారని చెప్పబడుతోంది.ఈ పూజా కార్యక్రమాలలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఆర్. రమణమ్మ, అసిస్టెంట్ కమిషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డి, అర్చకస్వాములు, వేదపండితులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్డేగేరి పరిధిలోని బంగారుపేట లో జరుగుచున్న ఫ్రైడే -డ్రై డే కార్యక్రమము



విభారె న్యూస్ కర్నూలు .:- కర్నూలు పట్టణ లోని యూపీ హెచ్ సి వడ్డేగేరి పరిధిలోని బంగారుపేట లో జరుగుచున్న ఫ్రైడే -డ్రై డే కార్యక్రమములో డెమో శ్రీనివాసుల శెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భముగా వారు మాట్లడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే - డ్రై డే కార్యక్రము లో బాగంగా ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని వార్డులను సందర్శినీచి ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వలు లేకుండ పూర్తిగా తొలగించి దోమలు పెరుగుదలను అరికట్టవిదంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అంతేకాకుండా ప్రజలకు వారి గృహ పరిసరాలలో పాత టైర్లు , కొబ్బరి చిప్పలు , పాతడబ్బాలు , ఉపయోగించని రోళ్ళు మొదలైనవి లేకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ వివరాలను ఫ్రైడే - డ్రై డే యాప్ నందు క్రమంతప్పక అప్ లోడ్ చేయాలని, ఒకవేల నీటి నిల్వలు గల ప్రానీతలను గుర్తించినట్లు అయితే ఆ వివరాలను వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్ నందు అప్ లోడ్ చేసి మరియు సంబనీదిత వార్డు సచివాలయ సెక్రెటరీ ద్వారా సమస్య పరిష్కారం అగునట్లు చూడాలని ఆదేశించారు. దీనివలన దోమల వలన వ్యాప్తి చేందు వ్యాదులు మలేరియా , డెంగ్యు, చికున్ గున్యా , బోదకాలు , మెదడు వాపు లను ఆరికట్ట వచ్చునని తెలిపారు. తదుపరి అంగన్వాడి కేంద్రం నందు వడదెబ్బ నివారణ పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు శెట్టి గారు మాట్లాడుతూ ప్రజలు ఉదయం 10 గంటలలోపు తమ పనులు ముగించుకొని నీడగల ప్రదేశాలలో ఉండాలని , తప్పని సరిగా బయట ఎండలో వెళ్ళివలసినచో గొడుగు, టోపీ, లేదా తలపై టవల్ పెట్టుకుని మరియు కాళ్ళ కు చెప్పులు ధరించి వెళ్లాలని, వెంట నీళ్ల బాటిల్ తీసుకుని గంట గంటకు నీళ్లు త్రాగాలని లేనిచో శరీరం లోని నీరు మరియు లవణాలు చెమట రూపంలో ఆవిరి అయిపోయి శరీరం నీరసం తో వడబ్బకు గురవుతారని తెలిపారు. అంతేకాకుండా వడదెబ్బ లక్షణాలు, వడదెబ్బ - ప్రథమ చికిత్స ,వడదెబ్బ భారిన పడకుండా ఆరోగ్య కార్యకర్త రవళి,అంగన్వాడి కార్యకర్తలు కౌసల్య , ఆనందమ్మ , ఆశా కార్యకర్త జ్యోతి పాల్గొన్నారు..

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190